క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



జలకనూరులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు చెరుకుచెర్ల, తలముడిపి, నాగలూటి, వీపనగండ్ల, జలకనూరు గ్రామాల్లో రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. సీఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని విధాల సహకరించాలని ప్రజలను కోరారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జగన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో దుర్వాసన లేకుండా చర్యలు



ప్రధాన మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో దుర్వాసన లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన మురుగు కాలువను జేసీబీతో కమిషనర్ శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా మురుగు నీరు నిలువ ఉండి దుర్వాసన వస్తే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

జమాత్‌కు వచ్చి తనువు చాలించి



మృతి చెందిన మాబుసా

మహానంది: పవిత్రమైన రంజాన్ మాసం అంటే ముస్లింలకు ఎంతో ప్రీతి. వయసులో పెద్దవారైనా అల్లాహ్ ప్రార్థనల కోసం ఊర్లు దాటి మసీదులకు వెళ్తుంటారు. అందులో భాగంగా ఆళ్లగడ్డ మండలం చింతకుంట్లకు చెందిన మాబుసా(68) తిమ్మాపురంలోని కొత్తమసీదులో జమాత్‌కు వచ్చి ప్రార్థనలకు హాజరయ్యాడు. ఈ క్రమంలో ఆయన గుండెపోటుకు గురై మృతి చెందినట్లు జమత్ అమీర్ సాబ్ తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



బాధితులకు సామగ్రిని అందిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు


మహానంది: బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మార్కండేయులు, మార్తమ్మ దంపతులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వంటసామగ్రి, కిట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి, వైస్ చైర్మన్ ఆర్.మారుతి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సహాయం అందించారు. కార్యక్రమంలో సభ్యులు షరీఫ్, మోహన్, వెంకటేశ్వర్లు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు శ్రీచక్రార్చన

నంద్యాల(వ్యవసాయం): శ్రీజగజ్జననీ దేవాలయ వార్షికోత్సవం పురస్కరించుకొని నాల్గవ రోజు అమ్మవారికి శ్రీచక్రార్చన వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా వేదమంత్రాలచే నివారణ పూజా విధితో శ్రీచక్రార్చన నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళా ఓటర్లే కీలకం

- నందికొట్కూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- ఆరుమండలాల్లోనూ వారిదే పైచేయి
- మొత్తం ఓటర్లు 2,52,066 మంది
- 2019 కంటే 2024లో పెరిగిన ఓటర్ల సంఖ్య



నందికొట్కూరు నియోజకవర్గ మ్యాప్

జూపాడుబంగ్లా: నందికొట్కూరు నియోజవర్గంలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పురుష ఓటర్ల కంటే వారే అధికంగా ఉన్నారు. 1,23,358 మంది పురుష ఓటర్లు ఉండగా మహిళలు 1,28,682 మంది ఉన్నారు.

1951లో నియోజకవర్గ ఆవిర్భావం

నవనందులకోటగా పేరొందిన నందికొట్కూరు నియోజకవర్గానికి రాష్ట్ర రాజకీయ చరిత్ర పుటల్లో ఎప్పుడూ ఓ ప్రత్యేకత ఉంటుంది. 1951లో మిడుతూరు నియోజకవర్గంగా ఆవిర్భవించగా 1952లో మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1955లో నందికొట్కూరు నియోజకవర్గంగా మార్చి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటి దాకా 15 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరగగా 2024 మే 13న 16వ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుండగా నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన 2,52, 066 మంది ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 5,324 మంది అధికంగా ఉన్నారు.

2019లో తగ్గిన ఓటర్ల సంఖ్య

2014 ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గంలో 1,00,988 మంది పురుషులు, 1,02,531 మంది మహిళా ఓటర్లు, 22 మంది ట్రాన్స్‌జెండర్స్ కలుపుకొని మొత్తం 2,03541 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఏటేటా జనాభా పెరుగుతున్న నేపథ్యంలో 2019 నాటికి ఓటర్ల సంఖ్య పెరగాల్సి ఉండగా అనూహ్యంగా తగ్గిపోయింది. 2019 ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 97,827 మంది పురుషులు, 99,614 మంది మహిళా ఓటర్లు, 10మంది ట్రాన్స్‌జెండర్స్ కలుపుకొని 1,97,451మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి 2014 ఎన్నికల కంటే 2019లో ఓటర్ల సంఖ్య పెరగాల్సి ఉండగా 6,090మంది ఓటర్ల సంఖ్య తగ్గిపోయింది.

నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో ఓటర్ల వివరాలు ఇలా...

మండలం	పురుష ఓటర్ల	మహిళ ఓటర్లు	ఇతరులు	మొత్తం
జూపాడుబంగ్లా	14,471	15,164	1	29,637
కొత్తపల్లి	12,604	12,768	2	25,374
మిడ్తూరు	17,667	18,371	2	36,040
నందికొట్కూరు(రూ)	31,456	33,130	9	64,595
నందికొట్కూరుటౌన్	17,233	18,264	9	35,508
పగిడ్యాల	13,193	13,807	1	27,001
పాములపాడు	16,733	17,178	2	33,913
మొత్తం	1,23,358	1,28,682	26	2,52,066

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రం వద్ద డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూలు, ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో జరుగుతున్న పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రధానంగా పట్టణం, అన్ని చోట్లా జిరాక్స్ కేంద్రాలను పరీక్ష జరిగే సమయం వరకు మూసి వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల, పాత ముచ్చుమర్రి అంచె వద్ద ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం సీఐ విజయభాస్కర్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద బయటి వ్యక్తులు సంచరించకుండా విద్యార్థుల ప్రశాంతతకు భంగం కలుగకుండా బందోబస్తు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పగిడ్యాలలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. పొగాకుకు నిప్పు పెట్టిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

రెండవ రోజు పది పరీక్షలు ప్రశాంతం

కొత్తపల్లి: పదవ తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం కొత్తపల్లి, గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలలో 258 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 219 మంది హిందీ పరీక్ష రాశారని, 39 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు. కొత్తపల్లి, గోకవరం పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ తిరుపతయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

పది పరీక్షల కేంద్రాలను తనిఖీ

నందికొట్కూరు: పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. హిందీ పరీక్షలు ప్రారంభమైన క్షణాల్లోనే పరీక్ష కేంద్రాలకు వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు విద్యార్థులు పాల్పడక పోవడంతో పరీక్ష కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల నిఘాలో పరీక్షా కేంద్రాలు

మహానంది: పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, గాజులపల్లెలోని పరీక్షా కేంద్రాల వద్ద మంగళవారం ఏర్పాట్లు పరిశీలించారు. బండిఆత్మకూరు మండలంలో రెండోరోజు 506 మంది పరీక్షలు రాయగా 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మహానంది మండలంలో 23 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని సిబ్బంది చెప్పారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



నందికుంటలో బ్యానర్ తొలగిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, ఎదురుపాడు, శివపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, దుద్యాల, కొక్కెరంచ, నందికుంట, గుమ్మడాపురం గ్రామాలలో పర్యటించి పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు తీసేయించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాములపాడు: ఎన్నికల నిబంధనలు అందరికీ వర్తిస్తాయని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని యర్రగూడూరు, బానుముక్కల, బానకచెర్ల గ్రామాల్లో పర్యటించారు. రాజకీయపార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఎక్కడా లేవని, ఇప్పటికే సిబ్బంది తొలగించారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు నాగార్జున రెడ్డి, శివలింగం ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

మిడుతూరు: ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ గంగావతి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తిమ్మాపురం, చెరుకుచెర్ల గ్రామ సచివాలయాలను సందర్శించి ఎన్నికల నియమావళిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.. ఏ రాజకీయ పార్టీలకైనా అనుబంధంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలి



బీఎల్‌ఓ లకు సలహాలు, సూచనలు ఇస్తున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

జూపాడుబంగ్లా: బీఎల్‌ఓలు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని 33 పోలింగ్ బూత్‌లకు చెందిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. గుర్తించిన పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలున్నాయా లేకపోతే వాటి వివరాలు తెలియజేయాలన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులున్నట్లు బీఎల్‌ఓ లు తెలిపారు. అలాగే ఏప్రిల్ 15 వరకు ఓటర్ల జాబితాల్లో పేర్లులేని వారు ఫారం-6 ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా 80ఏళ్ల పైబడిన ఓటర్లు ఎంతమంది ఉన్నారో నమోదు చేసుకొని, వారు ఇంటివద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా దరఖాస్తు ఫారాలను పూరించి ఇవ్వాలన్నారు.

పొట్టిశ్రీరాములు విగ్రహానికి ముసుగు తొలగించాలి

నందికొట్కూరు: పొట్టిశ్రీరాములు విగ్రహానికి ముసుగు తొలగించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమించిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి ముసుగు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కేజీ రోడ్డుపై ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి చట్టానికి వ్యతిరేకంగా ముసుగు వేయడం సబబు కాదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, వీఆర్ శ్రీను, పార్థసారథి, మురళీకృష్ణ, నాగరాజు, ఆర్ట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు కొలనుభారతిదేవి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కొత్తపల్లి: ఈ నెల 21న కొలనుభారతి దేవి ఆలయ శాశ్వత హుండీ లెక్కింపు చేస్తున్నట్లు ఆలయ ఈఓ మోహన్, పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అందరి సమక్షంలో 22-09-2023 నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి భక్తులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

శివనందిలో..

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలోని నవనందుల్లో ఒకటైన శ్రీ శివనందీశ్వర స్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగప్రసాద్ మంగళవారం తెలిపారు. శ్రీ పార్వతి సమేత శివనందీశ్వర స్వామి వారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి పెద్దలు, భక్తులు హాజరుకావాలని కోరారు.

అవి-ఇవి

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెరువు ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం క్షయవ్యాధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, గళ్ల పరీక్ష ద్వారా నిర్ధారణ చేయవచ్చని తెలిపారు. పౌష్టికాహారంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నయం అవుతుందని చెప్పారు.

సారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం పట్టణ సమీపంలోని జమ్మిచెట్టు వద్ద నాటుసారా విక్రయిస్తున్న నీలిషికారి హరిని అరెస్టు చేశారు. అతని వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్వగృహంలో ఎమ్మెల్యేతో పాటు కౌన్సిలర్ ధర్మారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు.

టీడీపీ రెబల్‌గా అభ్యర్థిగా బరిలో ఉంటా

నందికొట్కూరు: తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటానని మాధవరం బ్రహ్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నాయుడుతో మంచి సంబంధాలు ఉన్నాయని, టికెట్ రాకపోవడంతో రెబల్‌గా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

కొత్తపల్లి: కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీఓ రేష్మ ఉపాధి కూలీలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ శివారుల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ముందుగా కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. రోజువారీ వేతనం రూ.272 వర్తించే విధంగా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు ఇస్తారని, వాటికి అనుగుణంగా పనులు తప్పకుండా చేయాలన్నారు.

వివాహాలు చేసేందుకు లైసెన్సులు మంజూరు

నంద్యాల (సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలోని పాస్టర్లు, పురోహితులు తమ పరిధిలోని ప్రార్థనాలయాల్లో వివాహాలు చేసేందుకు ప్రభుత్వపరంగా లైసెన్సులు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని మిడుతూరు మండలం జలకనూరు ఏబీఎమ్ చర్చ్ పాస్టర్ గగ్గటూరు విక్టర్ పాల్‌కు లైసెన్సు జారీ చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీఓ నంబర్ 23లో పేర్కొంది.

బాలిక అదృశ్యం

మహానంది: 17ఏళ్ల తన కుమార్తె గత మూడు రోజుల నుంచి కనిపించడం లేదని బొల్లవరం గ్రామానికి చెందిన గోతం చిన్నమ్మ ఫిర్యాదు చేసినట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిందన్నారు. బంధువుల ఇళ్ల వద్ద అన్వేషించినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మండుతున్న ఎండలు



మహానంది కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. ఇక ఏప్రిల్, మే ఎలా ఉంటాయో అంటూ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. తాజాగా మండలంలో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పుడే భానుడి భగభగలు ఇలా ఉంటే ఇక రానున్న రెండు నెలల్లో మరింత పెరుగుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. ఇదిలా ఉండగా మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువ సమయం కోనేరుల్లో స్నానాలు చేస్తూ గడుపుతున్నారు.

అడవులను పరిరక్షించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహానంది: అడవులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్ తెలిపారు. అడవుల సంరక్షణలో భాగంగా మంగళవారం మహానందిలోని విద్యార్థులకు చలమ సెక్షన్‌లో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.

చలమ రేంజ్‌లో పశువులకు టీకాలు

నంద్యాల జిల్లా చలమ అటవీశాఖ రేంజ్ పరిధిలో రేంజర్ ఈశ్వరయ్య, ఎఫ్ఎస్‌ఓ ఎల్లమ్మ, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై యజమానులు దృష్టి సారించాలన్నారు. మేతకు అడవుల్లోకి వెళ్తుంటాయని, వన్యప్రాణులకు ఎలాంటి వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా సరళమ్మ

నంద్యాల(సెంట్రల్): నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలిగా డాక్టర్ సరళమ్మ నియమితులయ్యారు. ఇదివరకు సహసంచాలకుడిగా పనిచేసిన డాక్టర్ ఎన్సీ వెంకటేశ్వర్లు గుంటూరులోని లామ్ ఫారంకు బదిలీ అయ్యారు. డాక్టర్ సరళమ్మ ప్రస్తుతం నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. పరిశోధన స్థానంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేసేలా తనకు అప్పగించిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఆమె తెలిపారు.

టెండరు ఫారముల స్వీకరణ వాయిదా

నంద్యాల టౌన్ : జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో పలు అవుట్ సోర్సింగ్ పనుల కోసం ఈ నెల 6న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి టెండరు ఫారముల స్వీకరణ వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ నెల 20వ తేదీన చేపట్టాల్సిన టెండరు ఫారముల స్వీకరణ వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆత్మకురు డీఎస్పీ శ్రీనివాసరావు

మిడుతూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో ఆత్మకూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్ (కేంద్ర సాయుధ బలగాలు) మిడుతూరులో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ గ్రామ సభలో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. పోలింగ్ రోజు నచ్చిన వారికి ఓటు వేసుకునేందుకు ప్రశాంతవాతావరణం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఎస్‌ఐ మోహనరామ్, ఏఎస్‌ఐ సుబ్బయ్య, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ

నంద్యాల టౌన్ : దీర్ఘ కాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మంగళవారం ఆయన నంద్యాల మండలంలోని చాపిరేవుల, గోస్పాడు మండలంలోని యాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపీలో రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలు, మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. లేబర్ రూం, ఫార్మసీని పరిశీలించారు.

ఉగాది ఉత్సవాలకు కార్యాచరణ సిద్ధం చేయండి

- శ్రీశైల ఈఓ పెద్దిరాజు



ఉగాది మహోత్సవాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: ఉగాది మహోత్సవ ఏర్పాట్లపై గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనుసరించి అన్ని విభాగాలు కూడా తగు కార్యాచరణ సిద్ధం చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అన్నారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఉగాది మహోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని కోణాల నుండి తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఆయా ఏర్పాట్లన్నీ పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రానికి విచ్చేసే భక్తులందరితో మర్యాదగా మెలగాలని, ప్రతి భక్తుడిని ఒక అతిథిగా భావించాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ కంతా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అన్నారు. ఉత్సవాలలో స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం అటవీశాఖ అధికారుల సమన్వయంతో ఆయా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. క్యూకంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లలో వేచిఉన్న భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందించాలని, అవసరమైన చోట్ల కూలర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో మండల తహసీల్దార్ గుర్రప్ప, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మణ్‌రావు, గంగయ్యయాదవ్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆయూబ్‌ఖాన్, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవాణి, అపోలో వైద్యులు డాక్టర్ శ్రవణ్, దేవస్థానం అన్ని యూనిట్ విభాగాల అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.